క్లుప్తంగా

సీపీఆర్ విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రతినిధులు

టెక్కలి : అత్యవసర సమయాల్లో చేసే సీపీఆర్ విధానంపై 108 వాహన సిబ్బందికి అవగాహన ఉండాలని జిల్లా ఏఈఎంఎస్ ఓఈ రంగ ప్రసాద్, ఓజేటీ ఎస్.కృష్ణారావు సూచించారు. గుండె సంబంధిత ప్రాథమిక వైద్యంపై గురువారం టెక్కలి జిల్లా ఆసుపత్రిలో 108 సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో గుండె సంబంధిత సమస్యతో అపస్మారక స్థితికి చేరుకున్న వారిని సీపీఆర్ విధానంతో బతికించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో టెక్కలి, పలాస డివిజన్ 108 సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ సంబరం



ప్రగడపుట్టుగలో ఎల్లమ్మ అమ్మవారి సంబరం

కవిటి: మండలంలోని పుటియాదళలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి చల్లదనం సంబరం గురువారం వైభవంగా జరిగింది. ప్రగడపుట్టుగకు చెందిన తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా వైశాఖమాసంలో చల్లదనం చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఖరీఫ్ వరిసాగుకు సమాయత్తమయ్యే రైతులు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అమ్మవారిని భాజాభజంత్రీలు, బాణసంచా కాలుస్తూ యువత డ్యాన్స్ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. గ్రామశివారులోని పంటపొలాల్లో ఎల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం పంచిపెట్టారు.

కూల్‌గా ముంచేస్తున్నారు!

- కల్తీ ఐస్‌తో అనారోగ్యం
- ప్రమాణాలు పాటించని పలువురు తయారీదారులు
- సక్రమంగా పర్యవేక్షించని అధికారులు
- ఆస్పత్రి పాలవుతున్న ప్రజలు



బాక్సులో ఉన్న ఐస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందు కు, దాహార్తి తీర్చుకునేందుకు చాలామంది జ్యూస్‌సెంటర్లు, చల్లని పానీయాలు విక్రయించే షాపులను ఆశ్రయిస్తున్నారు. అయితే అక్కడ వినియోగించే ఐస్ నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉంటోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు తయారీదారులు అపరిశుభ్రమైన నీటితోనే ఐస్ తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఆరోగ్యశాఖ, ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఐస్‌లో రెండు రకాలు..

వాస్తవంగా ఐస్‌ను రెండు రకాలుగా తయారు చేస్తుంటారు. వాటిలో ఒకటి ఎడిబుల్ ఐస్. ఇది చిన్నచిన్న క్యూబ్స్ మాదిరిగా ఉంటుంది. ఎక్కువగా స్టార్ హోటళ్లలోనే దీనిని వినియోగిస్తుంటారు. దీనిని తినే ఆహార పదార్థాలు, పానీయాల్లో వినియోగించవచ్చు. రెండోది నాన్ ఎడిబుల్. పెద్ద పెద్ద దిమ్మలుగా ఈ ఐస్‌ను తయారు చేస్తారు. దీనిని కేవలం ఆహారం, చేపలు, మాంసం లాంటివి నిల్వ ఉంచేందుకే వాడుతుంటారు. తినేందుకు నాన్ ఎడిబుల్ ఐస్ అస్సలు పనికి రాదు. కానీ ఈ దిమ్మల రూపంలో దొరికే ఐస్‌నే చాలా మంది వ్యాపారులు జ్యూస్‌లు వంటి పానీయాల్లో వాడేస్తున్నారు. చాలా తక్కువ ధరకు దొరకడమే ఇందుకు కారణం. క్యూబ్స్ రూపంలో ఉండే ఎడిబుల్ ఐస్‌ను ప్రత్యేకంగా కుటీర పరిశ్రమలుగా ఏర్పడి చాలా జాగ్రత్తల మధ్య తయారు చేస్తారు. ఇళ్లలో ఉండే రిఫ్రిజిరేట్ల లాంటి పరికరాల్లో ఈ ఐస్ క్యూబ్స్‌ను తయారు చేస్తారు. సాధారణ ఐస్ దిమ్మలతో పోలిస్తే ఈ క్యూబ్స్ ధర కనీసం ఐదారు రెట్లు అధికంగా ఉంటుంది.

ఆ ఐస్ హానికరం..

శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో, నేషనల్ హైవేలో రోడ్డు పక్కన కుప్పలుతెప్పలుగా శీతల పానీయాలు విక్రయించే దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. ప్రతిచోటా పానీయంలో తప్పనిసరిగా ఐస్ వేసి ఇస్తుంటారు. అసలు ఐస్ లేకుండా ఇస్తే కొనుగోలుదారులు సైతం తాగేందుకు ఇష్టపడటం లేదు. అందుకే ఐస్ వినియోగం వేసవిలో భారీగా పెరిగింది. 99 శాతం మంది వ్యాపారులు వినియోగించే ఐస్ తినేందుకు, తాగేందుకు పనికిరాదు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఉన్న పలు ఐస్ ఫ్యాక్టరీల్లో బోరు నుంచి తీసిన కలుషిత ఉప్పు నీటినే వినియోగిసున్నట్లు సమాచారం. ఏటా ఆహార భద్రత తనిఖీ అధికారుల నామమాత్రంగా తనిఖీలు చేసి ఊరుకోవడంతో కల్తీ ఐస్ తయారీదారుల్లో ఎటువంటి చలనం ఉండటం లేదు.

ఆస్పత్రి పాలవుతున్న బాధితులు..

ఇటీవల కాలంలో పెరిగిన ఎండవేడికి ఐస్‌వాటర్, జ్యూస్‌ల వినియోగం పెరిగింది. ఇదే స్థాయిలో వారం రోజులుగా గొంతునొప్పి, జ్వరం బారినపడుతూ ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువైంది. రహదారుల పక్కన బండ్లపై అమ్మే పండ్ల జ్యూస్, చెరకు రసాలు, నిమ్మ సోడా, షరబత్ లాంటివి తాగడంతో శరీరం చల్లబడినట్టుగా హాయిగా అనిపిస్తుందని, అయితే కలుషిత ఐస్ వల్ల తాత్కాలికంగా శరీరం చల్లబడి ఉపశమనం కలిగినా గంటల వ్యవధిలోనే దాని దుష్ప్రభావం శరీరంపై పడుతోంది. ఫలితంగా గొంతునొప్పి, జ్వరం వంటి వ్యాధులు చుట్టుముడుతున్నాయి.

రోగాలు ఖాయం..



కలుషిత ఐస్‌తో చేసిన పానీయాలు తాగడం ప్రమాదకరం. ముఖ్యంగా గొంతు, చెవి, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారు వీటికి దూరంగా ఉండాలి. లేకపోతే గొంతునొప్పి, జలుబు, నిమోనియాతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. కూలింగ్‌లేని నీటిని మాత్రమే తాగాలి. చల్లని పదార్థాలు తీసుకోవడం వల్ల గొంతు ఎర్రబారిపోవడం, జలుబు, దగ్గు, జ్వరం, తుమ్ములు, తలనొప్పి వంటి లక్షణాలు వస్తాయి. వర్షాలు పడటం మొదలైన వెంటనే జ్వరం, గొంతునొప్పి వంటివి వచ్చే ప్రమాదముంది. ప్రజలంతా జాగ్రత్తలు పాటిస్తూ మంచి ఆహార పదార్థాలను మాత్రమే స్వీకరించాలి.

– డాక్టర్ చక్కా నారాయణరావు, గొంతు, చెవి వ్యాధులు నిపుణుడు, శ్రీకాకుళం

తెలుగు భాషపై మక్కువ పెంచాలి



బద్రి కూర్మారావును సన్మానిస్తున్న దృశ్యం

పలాస : తెలుగు భాషపై మక్కువ పెంచాలని, ఆంగ్ల మాధ్యమ ప్రభావంతో తెలుగు భాషకు దూరమవుతున్న విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చి మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలని రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు చెప్పారు. ఇటీవల తెలంగాణ తెలుగు భాషా సారస్వత పరిషత్‌లో రెండు రోజుల పాటు జరిగిన బాల సాహిత్య సమ్మేళనంలో ఆయన పాల్గొని 'బడి భాష తెలుగు'పై ప్రసంగించారు. భాషా పరిరక్షణ విషయంలో ముఖ్యంగా తల్లిదండ్రుల్లో మార్పురావాలన్నారు. పాటలు, కథలు, తెలుగుభాష గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేయాలన్నారు. 20 ఏళ్లుగా తెలుగు భాషా, జానపద కళలపై పరిశోధనలు చేయడమే కాకుండా వాటి పరిరక్షణకు ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి జె.చెన్నయ్య, డాక్టర్ వరప్రసాదరెడ్డి, డాక్టర్ కె.లీల రమణాచారి తదితరులు బద్రి కూర్మారావును ఘనంగా సన్మానం చేసి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల రచయితలు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

బాబోయ్ పాములు!



బాత్‌రూంలో ఉన్న నాగుపాము

టెక్కలి రూరల్: అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకోలేక పాములు ఇళ్లల్లోకి ప్రవేశిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. టెక్కలి పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా పలువురు ఇళ్లల్లోకి నాగుపాములు ప్రవేశించిన ఘటనలు చోటుచేసుకోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఇళ్లను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారాలు పారబోయడంతో పిచ్చిమొక్కలు పెరిగి పాములకు ఆవాసాలుగా మార్చుకున్నాయి. గత కొద్దిరోజులుగా ఎండవేడిని తట్టుకోలేక సమీప ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. గురువారం స్థానిక అయ్యప్పనగర్‌లోని ఓ ఇంటి బాత్ రూంలోకి భారీ నాగుపాము చొరబడటంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఎన్‌టీఆర్ కాలనీలోనూ ఓ ఇంట్లో పాము ప్రవేశించడంతో పాములు పట్టేవారికి సమాచారం అందించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నర్సింహమూర్తి

సోంపేట: గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. రైతుభరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులతో గురువారం సోంపేట వ్యవసాయ కార్యాలయంలో 2024 ఖరీఫ్ సంసిద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న వారం రోజుల్లో నైరుతి రుతుపవనాలు వల్ల వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు అందించాలని సూచించారు. రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేయాలన్నారు. మండలంలో 2250 ఎకరాల్లో పచ్చిరొట్ట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించినందుకు వ్యవసాయ సహాయకులను అభినందించారు. అనంతరం విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్!



విద్యాకానుక స్టాక్‌పాయింట్‌లో పాఠ్య పుస్తకాలు

ఇచ్ఛాపురం: మండల కేంద్రం ఇచ్ఛాపురంలోని ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విద్యాకానుక స్టాక్ పాయింట్‌కి 8వ తరగతి పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయని ఎంఈఓ కె.అప్పారావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రం నుంచి చేరిన పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లిష్, ఇంగ్లిష్ నాన్‌డిటెయిల్, హిందీ, గణిత, ఫిజిక్స్, బయాలజీ, హిస్టరీ, జియోగ్రఫీ, పొలిటికల్ సైన్స్, తెలుగు సబ్జెక్టులకు సంబంధించి 11,777 పాఠ్యపుస్తకాలు రావలసి ఉండగా 11,216 పుస్తకాలు వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రవికుమార్, సమగ్రశిక్ష అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధజలం ప్లాంట్ ఏర్పాటు



సీతారామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులోని సీతారామాలయం ప్రాంగణంలో శుద్ధజల ప్లాంట్ (ఆర్‌ఓ)ను ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో షిర్డీసాయిబాబా మందిరం నిర్వాహకులు రూ.రెండు లక్షలు వెచ్చించి దీనిని అందుబాటులోకి తీసుకొచ్చారు. సీతారామాలయం ప్రాంగణంలో ఉన్న పది ఆలయాల సముదాయానికి హాజరైన భక్తులు, రైల్వే ప్రయాణికులు, వాకర్స్, ఇతరులకు ఇక్కడి ఆర్‌ఓ ప్లాంట్ ఉపకరంగా ఉంటుందని షిర్డీసాయిబాబా మందిరం మేనేజర్ సాంబశివరావు తెలిపారు.

ఆరోగ్యానికి 'పొగ' పెడుతున్నారు!



జీడిపరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ

కాశీబుగ్గ: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలను కలిపే టి.శాసనాం–పర్లాఖిమిడి రోడ్డులో మందస మండలం రాధాకృష్ణాపురం సమీపంలోని సారంగిపురం జంక్షన్ వద్ద వాయు కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ జంక్షన్‌లో ఆరు జీడి పరిశ్రమలు, నాలుగు రైసు మిల్లులు ఉన్నాయి. రోడ్డుకు ఆనుకుని ఉన్న జీడి పరిశ్రమ నుంచి దట్టమైన పొగ, మిల్లు నుంచి ఊక ఎగిరిపడుతుండటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దాటే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు. ఈ విషయమై పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోతోంది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

జూద శిబిరంపై దాడి

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ లాడ్జీ సమీపంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై నరసన్నపేట పోలీసులు గురువారం రాత్రి దాడి చేసి ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారి వద్ద రూ.15,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. లాడ్జి వెనుక బాగాన జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. పట్టణంలో ఎక్కడ జూదం ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

సరుబుజ్జిలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చినకాగితాపల్లి హెచ్‌ఎం తవిటినాయుడు తెలిపారు. పాతపాడు, లొద్దలకాగితాపల్లి గ్రామాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విద్య ఆవశ్యకత గురించి ప్రచారం చేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, దుస్తులు, బ్యాగులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు, ప్రస్తుతం సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 18 నుంచి ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దూర ప్రాంత విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

టెక్కలి రూరల్ : మండలంలోని నర్సింగపల్లి గ్రామానికి చెందిన జి.అప్పలస్వామి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో నర్సింగపల్లి సేవాసంఘం సభ్యులు రూ.11 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు యన్ని షణ్ముఖరావు గురువారం తెలిపారు. నిరుపేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

పాతపట్నంలో కార్డన్ సెర్చ్

పాతపట్నం: జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు సహకరించాలని పాతపట్నం, మెళియాపుట్టి ఎస్‌ఐలు మహమ్మద్ యాసిన్, రాజేష్ అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని శివశంకర్ కాలనీ 1, 2, 3, 4 వీధుల్లో గురువారం కార్డన్ సెర్చ్‌లో భాంగా ఇంటింటా సోదాలు నిర్వహించారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాన్నారు. అందరూ కలిసిమెలిసి ఉండాలని, గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ద్విచక్రవాహనాలను పరిశీలించి, పత్రాలులేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఏఎస్‌ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

24 మంది గైర్హాజరు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతన్నాయి. అందులో భాగంగా గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 150 మంది హాజరుకావాల్సిండగా 24 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్ తెలిపారు. కెమిస్ట్రీ పరీక్షకు 113 మంది విద్యార్థులకు 90 మంది, కామర్స్ పరిక్షకు 37 మందికి 36 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.